పోలయ్య భుజం పట్టుకొని ఆపి, వాడినెత్తిన సూటుకేసులు, భుజాన బ్యాగులు తగిలించి ఆ మట్టి రోడ్డు మీద వాడి వెనుక నడవసాగాడు రవీంద్ర భార్యా బిడ్డలతో.

వీళ్ళ అడుగుల చప్పుడుకు మట్టి రోడ్డుకు అటూ ఇటూ కాలువల ఒడ్డున విడిది చేసిన కప్పలు దడదడమంటూ కాలువల్లోకి శబ్దం చేస్తూ దూకుతూ వుంటే ఆ మసక చీకట్లోనే పరవశించి పోయాడు ధర్మేంద్ర, రేపు తాను ప్రాక్టీసు చేయబోయే లాంగ్‌జంప్‌లు గుర్తుకొచ్చి.

రవీంద్ర స్వంత ఊరు నందలూరు. పదిహేనేళ్ళుగా ఉద్యోగ రీత్యా మద్రాసులో వుంటున్నాడు. అతని తల్లిదండ్రులు నందలూరులోనే వుంటున్నారు. దసరా సెలవులకు, సంక్రాంతి సెలవులకు, వేసవిసెలవులకు తప్పనిసరిగా తన స్వగ్రామానికి భార్య పిల్లలతో వస్తుంటాడు రవీంద్ర. ఇప్పుడు సెలవులు కాకపోయినా ఇదే ఊళ్లో వుంటున్న తన బాబాయి కుమార్తె పెళ్ళి సందర్భంగా సెలవు పెట్టి మరీ వచ్చాడు.

మరుసటి రోజు రవీంద్ర బాబాయి, ఆ ఊరి ఎలిమెంటరీ స్కూల్లో పాతికేళ్లుగా ఎలాంటి ట్రాన్సఫర్లు లేకుండా శాశ్వత టీచరుగా పేరు తెచ్చుకొన్న మాధవయ్య కుమార్తె పెళ్ళికి ఆ ఊరివాళ్లయిన అతని పాత శిష్యులు ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేసుకుంటున్న వాళ్లంతా వచ్చారు. వాళ్ళలో రవీంద్రతో చదువుకున్న అతని క్లాసుమేట్సు కూడా వున్నారు.

రవీంద్ర స్నేహితుల ఆహ్వానం మీద వాళ్ల ఇళ్లకు వెలుతూ ఆ పగలంతా ఆనందంగా గడిపితే, తల్లి శచీంద్ర ఎంత కట్టడి చేసినా తప్పించుకు వెళ్ళి ధర్మేంద్ర గుంటలు దగ్గర, కాలువలు దగ్గర చేరి కప్పలను బెదరగొట్టి వాటిలాగా లాంగ్‌జంప్‌లు ప్రాక్టీసు చేసి కప్పలకంటే ఘోరంగా ఒళ్లంతా బురద చేసుకుని ఇంటికి వచ్చాడు. తల్లికి తెలియకుండా నాన్నమ్మ దగ్గర జేరి బట్టలిప్పి స్నానం చేసి కొత్తబట్టలేసుకుని బుద్ధిమంతుడిలా ఆ రాత్రి పెళ్ళి పందిట్లో హాజరయ్యాడు.

పెళ్ళిలో జిగేల్‌మంటూ తిరుగుతున్న శచీంద్ర, రవీంద్రను సమీపించి, "ఏమండీ, మీరు చెప్పిన సూటు కేసులు, గీటుకేసులు పజిల్ ఇక్కడున్న ఆడవాళ్ళందరికీ వేశాను పెళ్ళి కూతురుతో సహా. ఎవరికీ అర్థంకాక బిక్క ముఖాలేశారు. గీటు కేసులంటే అర్థం చెప్పండి. వాళ్ళని ఆశ్చర్య పరుస్తాను" అంది.

రవీంద్రకు తల తిరిగిపోయింది. 'ఇదెక్కడ ఖర్మరా బాబూ. గీటుకేసులకు బోడి అర్థం కూడానా. ఆ మాటే అంటే ఇప్పుడు ఒప్పుకోదు శచీంద్ర, అనుకున్నాడు.

"వాళ్లనలాగే సస్పెన్సులో ఉంచు. వెళ్ళేలోగా చెబుతాను" అంటూ అప్పటికి శచీంద్ర చేతుల్లో నుంచి తప్పించుకున్నాడు రవీంద్ర.

పెళ్ళి పందిట్లో తదేకంగా తనవైపే చూస్తున్న సాదా చీర కట్టుకున్న ఒక స్త్రీని చూసి ఉలిక్కి పడ్డాడు రవీంద్ర. ఆమె అతని చిన్ననాటి స్నేహితుడు పరమానందం భార్య. పరమానందం,

